క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

కోడూరు: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి విషగుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శిరీష శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం..మండంలోని ఉల్లిపాలెం గ్రామానికి చెందిన అరజా వెంకటేశ్వరరావు (57) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబ పోషణ సాగిస్తాడు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక గురువారం సాయంత్రం విషగుళికలు తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో కుటుంబీకులు వెంకటేశ్వరరావును అవనిగడ్డ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడు. కేసు నమోదు చేసి, పోర్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

సామూహిక కుంకుమార్చన

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు ఆంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ధర్మాచార్యులు గరికిపాటి వీరాంజనేయులు, లింగం బసవశంకరావు పర్యవేక్షణలో 45 మంది మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

2న ఉచిత వైద్యశిబిరం

నాగాయలంక: ఆయుష్ హాస్పటల్స్, మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో సెప్టంబర్ 2న ఉప ముఖ్యమంత్రి పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నాగాయలంక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బండ్రెడ్డి హరి శుక్రవారం తెలిపారు. ఈసీజీ, ఎకో పరీక్షలతో పాటు బీపీ, సుగర్ పరీక్షలు, మోకాళ్ల నొప్పులు, జీర్ణకోశ వ్యాధులు, దివిసీమలో అధికంగా ఉన్న హెపటటిస్-బీ,సీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. మందులను ఉచితంగా అందిస్తామని తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు వైద్య, శిబిరాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 91444 42277 మొబైల్ నంబర్‌లో సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం

అవనిగడ్డ: చల్లపల్లికి చెందిన డయాలసిస్ పేషెంట్ పఠాన్‌బాబుకి వైద్య ఖర్చుల నిమిత్తం పురిటిగడ్డకు చెందిన ఐఈఎం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సురేష్ రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. పురిటిగడ్డలోని ఐఎఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పఠాన్‌బాబు కుమారుడు పఠాన్ కరీముల్లాకు అందజేశారు.


ఎంపీడీవోకు సత్కారం

కృత్తివెన్ను: మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ఎంపీడీవో వరుదు రాంబాబును ఆయన కార్యాలయ అధికారులు, సిబ్బందితో కలసి ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలానికి వచ్చి కొద్దిరోజులే అయినా తక్కువ సమయంలో ఎక్కువ అభిమానాన్ని రాంబాబు సంపాదించుకున్నారన్నారు. ఆయన శేష జీవితం సంతోషంగా ఆరోగ్యంగా సాగాలని కోరుకున్నారు. అనంతరం ఎంపీడీవో దంపతులను దుశ్శాలువా, పూలమాలలు, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైద్యశిబిరం

కోడూరు: స్థానిక పూతబోయిన చినవెంకటేశ్వరరావు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటిన ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు పూతబోయిన కరుణకుమార్ శుక్రవారం తెలిపారు. దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో జరిగే ఈ శిబిరంలో గుంటూరు విజయశ్రీ హాస్పటల్ వైద్య బృందం వైద్యసేవలందిస్తారని చెప్పారు. గుండె, నరాలు, ఎముకలు, చిన్నపిల్లలకు సంబంధిత వ్యాధులకు వైద్యసేవలందిస్తారని కరుణ కుమార్ చెప్పారు. ఉచితం ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు చేస్తారని, శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్‌ట్రెజరీ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసన



అవనిగడ్డ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీపీటీడీ) ఉద్యోగుల పట్ల సబ్ ట్రెజరీ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ స్థానిక ఆర్టీసీ డిపో గేటు ముందు నేషనల్ మజ్దూర్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం భోజన విరామ సమయంలో గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ రీజనల్ కార్యదర్శి కేసాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ట్రెజరీ శాఖ నిలిపివేసిన కండక్టర్లు, డ్రైవర్ల నైట్ అవుట్ అలవెన్స్‌లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇవ్వవలసిన అన్ని రకాల అలవెన్స్‌లను ప్రభుత్వ జీవో ప్రకారం యథావిధిగా ఇవ్వాలన్నారు. సిక్ లీవులకు జీతాలు, ఇంక్రిమెంట్ల అలవెన్స్‌లు వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనిట్ డిపో అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి కుమార్, రీజనల్ పబ్లిసిటీ సెక్రటరీ ముద్రగడ వెంకట పిచ్చేశ్వరరావు, గ్యారేజీ కార్యదర్శి పసుపులేటి శ్రీనివాస్, గ్యారేజీ అధ్యక్షుడు పి.చింతయ్యతో పాటు మొత్తం 30 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ లేకపోతే ఎలా?



ప్రాణాలు కాపాడటమే ధ్యేయంగా పనిచేసే వైద్యుల మాన, ప్రాణాలకు రక్షణ లేకపోతే ఎలా? కలకత్తాలో విధుల్లో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేసి చంపేయడం క్రూరమైన చర్య. సభ్యసమాజం తలదించుకునే ఈ పరిస్థితికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి. అంతేకాదు పనిచేసే చోట మహిళా వైద్యులతో పాటు మిగిలిన వైద్యులకు సైతం సరైన రక్షణ చట్టాలు తీసుకురావాలి. అప్పుడే వైద్యులు ధైర్యంగా పనిచేయగలుగుతారు.

-సూర్యతేజ, వైద్యులు, పీహెచ్‌సీ, చినపాండ్రాక, కృత్తివెన్ను మండలం



మహిళా ఉద్యోగులకు రక్షణ చర్యలు చేపట్టాలి



పీహెచ్‌సీల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు రక్షణ చర్యలు చేపట్టాలి. రాత్రి డ్యూటీ సమయాల్లో మహిళా సిబ్బంది మాత్రమే ఉండటంతో అత్యవసర కేసులకు వచ్చే సమయంలో తాగుబోతులు ఉండటంతో భయపడుతూ ఉద్యోగాలు చేయాల్సి వస్తుంది. ప్రతి పీహెచ్‌సీల్లో 24 గంటలు సీసీ కెమెరాలు పర్యవేక్షణ, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసి, నైట్ పోలీస్ పెట్రోలింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. అమానుషంగా ప్రవర్తించే వారికి తక్షణమే శిక్షపడేలా చూడాలి.

పి.పద్మావతి, స్టాఫ్ నర్సు, పీహెచ్‌సీ, శ్రీకాకుళం, ఘంటసాల మండలం

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

పోక్సో చట్టం–2012పై ఉపాధ్యాయులకు అవగాహన



పెడనలో పోక్సో చట్టంపై మాట్లాడుతున్న ఎంఈవో-1 దుర్గాప్రసాద్

పెడన: పోక్సో చట్టం–2012పై ఉపాధ్యాయులకు అవగాహన చాలా అవసరమని, ఆ చట్టం గురించి విద్యార్థులకు తెలియజేయాలనే లక్ష్యంతో ముందుగా ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నామని ఎంఈవో–1 దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక గుడివాడ రోడ్డులోని షాదిఖానలో మండలంలోని ఉపాధ్యాయులకు పోక్సో చట్టం–2012పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, డీఈవో తాహెరా సుల్తానా ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు పోక్సో చట్టం–2012 పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలనే లక్ష్యంతో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తొలుత అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల బాలికలకు క్రమశిక్షణను చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి మాట్లాడుతూ ప్రతి రెండో శనివారం కౌమార బాలికలకు పోక్సోచట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా ఉపాధ్యాయులు బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించటం ద్వారా కొంత మేరకు ఈ అఘాయిత్యాలు నివారించవచ్చునన్నారు. మిషన్ శక్తి స్కీం కౌన్సిలర్ సుప్రియ మాట్లాడుతూ ఎవరైనా లైంగిక వేధింపులకు గురవుతున్నప్పుడు భయపడకుండా వారి సమస్యలు, ఇబ్బందులు స్వేచ్ఛగా చెప్పుకునేందుకు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. పెడన ఎస్‌ఐ సత్యనారాయణ మాట్లాడుతూ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలకు పాల్పడే నిందితులకు కఠిన శిక్షలు అమలు అయ్యేలా ఈ చట్టాన్ని రూపొందించారన్నారు. ఎంఈవో–2 హరనాథ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



బంటుమిల్లిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ గణేష్‌కుమార్

విద్యార్థినుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

బంటుమిల్లి: మండల పరిధిలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పోక్సోచట్టం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఎంఈఓ బి.త్రిపుర సుందరీదేవీ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మైనర్లకు, మహిళలకు చట్టం కల్పిస్తున్న రక్షణ గురించి ఎస్‌ఐ గణేష్‌కుమార్ వివరించారు. విద్యా సంస్థల్లో విద్యార్థినుల భద్రతకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. బ్యాడ్ టచ్–గుడ్ టచ్ గురించి సీడీపీఓ సముద్రవేణి వివరించారు. సెల్‌ఫోన్ల వినియోగం ఎంత వరకు అవసరమో ఆలోచించి తగు జాగ్రత్తలు తీసుకోవలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 వెంకటేశ్వరరావు, హెచ్‌ఎంలు రామచంద్రరావు, వెంకట్రావు, ధర్మారావు, ఐసీడీఎస్ సూజర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి విద్యాబుద్ధులు నేర్పాలి

కోడూరు: విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పాలని ఎస్‌ఐ శిరీష అన్నారు. మండలంలో ఆరు నెలల వ్యవధిలో ముగ్గురు ఉపాధ్యాయులపై బాలికల వేధింపుల కేసులు నమోదు కావడంతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఈఓ ఆదేశాలతో విద్యాశాఖ, పోలీస్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఐ శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి మాట్లాడారు. బాలికల పట్ల ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు వారికి మంచిచెడులు చెప్పాలని ఎస్‌ఐ సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ఉపాధ్యాయులు కూడా అవగాహన కలిగి, విద్యార్థులకు కూడా వివరించాలన్నారు. మండలంలో ఆరు నెలల వ్యవధిలో మూడు ఘటనలు జరగడంపై ఉపాధ్యాయులు కూడా ఆలోచన చేయాలన్నారు. బాలికల సంరక్షణకు ఐసీడీఎస్ పెద్దపీట వేస్తుందని సూపర్‌వైజర్ రాజేశ్వరి చెప్పారు. ఉల్లిపాలెం, విశ్వనాథపల్లి పాఠశాలలో జరిగిన ఘటనలలో పూర్తిస్థాయిలో విచారణ చేసిన తరువాతే ముగ్గురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థకు మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఎంఈఓ కోరారు. ఎంఈఓ–2 శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.5.22 కోట్లతో ఉపాధి పనుల నిర్వహణకు ఆమోదం



పథకంలో చేసే పనులను వివరిస్తున్న అధికారులు

కోడూరు: మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.5.22 కోట్లతో పనుల నిర్వహణకు ఆమోదించినట్టు ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రత్యేక గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. గ్రామ సభల ద్వారా గుర్తించిన 63 సీసీ రోడ్ల నిర్మాణానికి పంచాయతీలు ఆమోదం తెలిపాయన్నారు. వీటితో పాటు 13 పంచాయతీల్లో 61 గోకులం షెడ్ల నిర్మాణాలకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటి నిర్మాణాలకు రూ.5.22 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించేందుకు కూడా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. పథకానికి సంబంధించి సందేహాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీఓ కోరారు. గ్రామ సభలో చర్చించిన అంశాలను ప్రజాప్రతినిధులకు వివరించారు. వివిధ శాఖలాధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేతల నిరసన



అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు

అవనిగడ్డ: ఏకీకృత పెన్షన్ స్కీంని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్రంలో సీపీఎస్, జెడీపీఎస్ వంటి పెన్షన్ల స్కీంల వల్ల ఇబ్బందులు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీంను తీసుకురావాలని చూస్తుందని విమర్శించారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూషన్‌తో కూడుకున్న ఎలాంటి పెన్షన్ స్కీంను యూటీఎఫ్ అంగీకరించదని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సూపరింటెంటెండ్‌కు యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వరరావు, ఎల్.సుభాషిణి, అవనిగడ్డ, నాగాయలంక, మోపిదేవి, చల్లపల్లి మండల శాఖల ప్రతినిధులు కె.జీవేంద్రరావు, బి.శివరామకృష్ణ, తెనాలి శ్రీనుబాబు, జి శ్రీధర్, ఎస్ఎస్ స్వామి, కె.నరేంద్ర, సింహాద్రి శ్రీనివాసరావు, నడకుదిటి ఉమామహేశ్వరరావు, బేతి వెంకటేశ్వరరావు, విమల పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ పూజలు



శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక లక్ష్మీపూజల్లో పాల్గొన్న మహిళలు

మచిలీపట్నంటౌన్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సుహాసినీలు లక్ష్మీపూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి విచ్చేసి లక్ష్మీదేవికి సామూహిక పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి బి. సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

సామూహిక వరలక్ష్మీవ్రతం..

బచ్చుపేటలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళా భక్తులు సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. స్థానాచార్యులు ముత్తేవి శశికాంత్ బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి గరుడసేవ సమితి సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. దాదాపు 300 మంది మహిళా భక్తులు ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ముత్తేవి రవికాంత్, ట్రస్ట్ బోర్డు సభ్యులు అన్నంబొట్ల బ్రహ్మానందశాస్త్రి, కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పైడమ్మ ఆలయంలో..

పెడన: పట్టణంలో దేవత శ్రీపైడమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం ఆఖరి వారం కావడంతో సామూహిక కుంకుమార్చనలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు (ముత్తయిదువలు) పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి సామూహిక కుంకుమార్చనల పూజా క్రతువును పూజారి అగ్నిహోత్రం హరికృష్ణ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మ దాసు వాయునందనరావుతో పాటు ఘతం గుడి ధర్మకర్త పైడేశ్వరరావు, తోట మహాశ్రీకుమార్ (బాబ్జీ) తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

కోడూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. మండలంలోని ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాల ఆవరణతో పాటు బొమ్మ సెంటర్ ప్రాంతంలో విద్యార్థులు పలు రకాల పూలు, పండ్ల మొక్కలను నాటారు. లింగారెడ్డిపాలెం, హరిపురం, రామకృష్ణాపురం, కోడూరు జెడ్పీ పాఠశాలల్లో కూడా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం రాజనాల నీరజ, ఉపాధ్యాయులు కాశీభొట్ల నాగభూషణం, రేపల్లె జయప్రద, జన్ను పావని, శివనాగమణి, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పెడన: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించేలా బాధ్యత తీసుకున్నప్పుడే మొక్కలు నాటినందుకు ఫలితం ఉంటుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలను నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

పెడన: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన బాలిక అదృశ్యం అయిన సంఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు 12వ వార్డుకు చెందిన బాలిక స్థానిక స్కూల్లో పదో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి వాకబు చేస్తే పాఠశాలలో ఆమె వేసుకెళ్లిన సైకిల్ కూడా లేదు. బంధువుల వద్ద, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు పెడన పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగుకు జీవం పోసిన వర్షం

దివిసీమలో ముమ్మరం చేసిన వరినాట్లు



పిట్టల్లంకలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

అవనిగడ్డ: ఎడతెరిపి లేకుండా గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం దివిసీమలో పంట పొలాలకు జీవం పోసింది. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు దిగువ ప్రాంతాల్లో సాగునీరందక ఇబ్బందులు పడిన రైతులు ఎడతెరపి లేని వర్షంతో ఊరట చెందారు. నిన్నటి వరకూ ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడిన రైతులు వాటికి విరామం ఇచ్చారు. వర్షంతో సాగునీటి ఖర్చులు తగ్గాయని కొంతమంది రైతులు సంతోషం వ్యక్తం చేశారు. దివిసీమలో ఇంకా 48 వేల ఎకరాల్లో వరినాట్లు పడాల్సి ఉంది. సాగునీందరక వరినారు సరిగా పెరగలేదు. ఇంజిన్లు, గుల్లపంపులతో సాగునీరు పెట్టుకుని నాట్లు వేసేందుకు రైతులు ఎదురు చూస్తున్న తరుణంలో కురిసిన వర్షంతో సాగుపనులు ముమ్మరం చేశారు. మరో రెండు రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్న మాటలు రైతులకు మరింత ఊరటనిచ్చినట్టయింది. కోడూరు మండలం ఉల్లిపాలెం, ఊటగుండం, ఇరాలి, సాలెంపాలెం, వేణుగోపాలపురం, పిట్టల్లంక, నారేపాలెం గ్రామాల్లో వరి నాటు పనులను రైతులు వేగవంతం చేశారు. సరిగా సాగునీరందక, వర్షాలు లేక నిన్నటి వరకూ ఎండిపోయి కనిపించిన వరిపొలాలు శుక్రవారం కురిసిన ఎడతెరపిలేని వర్షంతో నిండుకుండలా మారాయి. గత 20 రోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్న దివిసీమ రైతులకు ఎడతెరిపి లేని ఈ వర్షం కరువు తీర్చినట్టయింది.

వరికి ఊపిరి పోసిన వర్షం

కృత్తివెన్ను: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వరిపొలాలకు ఊపిరి పోసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో జనం ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. శివారు ప్రాంతాలకు సాగు నీరందక రైతులు పడుతున్న ఇబ్బందులను వర్షం తీర్చినట్లయింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆక్వారైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈదురుగాలులకు నెలకొరిగిన చెట్లు



కోడూరు మండలంలోని పిట్టల్లంక వద్ద ట్రాక్టర్‌పై విరిగిపడిన చెట్టు


కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం అర్ధరాత్రి నుంచి దివిసీమలో ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. శుక్రవారం వేకువజామున 4 గంటల సమయంలో ఉరుములు మెరుపుల శబ్దంతో దద్దరిల్లింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా ఓ మోస్తారు వర్షం కురుస్తునే ఉంది. మెరకగౌడపాలెం, వీవర్స్‌కాలనీ, అంబటి బ్రహ్మణయ్య కాలనీ, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల్లో రహదారులపై మోకాలు లోతులో నీరు నిలిచాయి. మందపాకల, లింగారెడ్డిపాలెం, పిట్టల్లంక, హరిపురం, పోటుమీద గ్రామాల్లో అంతర్గత రహదారులు బురదకయ్యలను తలపించాయి. గాలుల ప్రభావానికి పలు చోట్ల చెట్లు నెలకొరిగాయి. పిట్టల్లంక–గాబ రహదారిలో చెట్టు కొమ్మ విరిగి ట్రాక్టర్‌పై పడింది. దీంతో ట్రాక్టర్ ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది. నరసింహపురం గ్రామంలో కొబ్బరిచెట్లు విరిగి విద్యుత్‌తీగలపై పడ్డాయి. రామకృష్ణాపురం ప్రాంతంలో గాలుల తీవ్రతకు స్తంభాలు ఒరిగాయి. గాలుల ప్రభావంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఆటో బోల్తా : విద్యార్థులకు గాయాలు



చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలోని రుద్రవరం గ్రామం కృష్ణా యూనివర్సిటీ సమీపంలో రహదారిపై ఆటో పల్టీ కొట్టడంతో చిన్నారులకు గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కోన గ్రామం నుంచి కాలేఖాన్‌పేటలోని స్వాతి పబ్లిక్ స్కూల్‌కు ప్రతిరోజు ఆటోలో విద్యార్థులను తరలిస్తూ ఉంటారు. అదే క్రమంలో స్కూల్ నుంచి కోన గ్రామానికి బయలుదేరిన ఆటో యూనివర్సిటీ సమీపంలో రోడ్డుపై గుంతలో దిగి అదుపు తప్పిన ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో పలువురు చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఆటోను పైకి లేపి చిన్నారులకు ప్రమాదం జరగకుండా కాపాడారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే బోల్తా పడినట్లు స్థానికులు చెబుతున్నారు. బందరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరదొస్తున్నా ఆగని పడవ ప్రయాణం



కోడూరు: కృష్ణానదికి భారీగా వరద నీరు వస్తున్నా పడవ ప్రయాణాలు ఆగడం లేదు. ఓ వైపు వరద నీరు మరొకవైపు అమావస్య పోటుతో కృష్ణానది నీరు ప్రమాదస్థాయికి చేరింది. నదిలో మత్స్యకారులు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీ చేసి అప్రమత్తం కూడా చేశారు. అయితే మండలంలోని పిట్టల్లంక వద్ద పడవ ప్రయాణాలను మాత్రం సంబంధిత బోటు యజమానులు నిలుపుదల చేయలేదు. గాలుల తీవ్రత అధికంగా ఉన్నా ప్రయాణికుల ప్రాణాలను ఫణంగా పెట్టి పడవ ప్రయాణాలు చేయిస్తున్నారు. ద్విచక్రవాహనాలను కూడా పడవలో ఎక్కించడంతో ఆందోళన నెలకొంది. అధికారులు స్పందిం ప్రయాణాలను నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

ఎన్‌సీసీ విభాగం ప్రారంభం

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగ మునిసిపల్ హైస్కూల్ లో ఎన్‌సీసీ విభాగాన్ని ప్రారంభించినట్లు స్కూల్ హెచ్‌ఎం యూవీ కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీసీ 16 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సన్నార్ సింగ్ ఈమేరకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. 50 మంది క్యాడెట్లతో స్కూల్ ఎన్‌సీసీ విభాగాన్ని ప్రారంభిస్తామన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పాఠశాల ఉపాధ్యాయులు ఏవీ రామాంజనేయులును నియమించినట్లు తెలిపారు. త్వరలో మధ్యప్రదేశ్‌లోని కాట్నీ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందనున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ పాఠశాలల్లో ఎన్‌సీసీ ఉన్న ఏకైక పాఠశాల పాండురంగ ఉన్నత పాఠశాల నిలవటం ఎంతో గర్వంగా ఉందన్నారు. వారం రోజుల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహిస్తామన్నారు.

ఆకస్మిక ప్రమాదాల్లో ప్రథమ చికిత్సే ప్రధానం

పాపవినాశనం(ఘంటసాల): ఆకస్మిక ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స ప్రధానమైనదని ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ టీమ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు కుమార్ నంది అన్నారు. మండలంలోని పాపవినాశనం గ్రామస్తులకు ప్రకృతి విపత్తులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ కుంపటి అనిత, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీవో కె.మురళీ కృష్ణ, మొవ్వ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, రీసర్వే డీటీ పుప్పాల శ్రీనివాసరావు, ఈవో రమాదేవి, వీఆర్వో, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

గూడూరు: ఆకులమన్నాడు శివారు కప్పలదొడ్డిపాలెం, కప్పలదొడ్డి ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పలువురు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం చిన్నాకులమన్నాడులోని రామాలయం దగ్గర ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ కప్పలదొడ్డి, ఆకులమన్నాడు, కప్పలదొడ్డి పాలెం ప్రాంత రైతులకు లజ్జబండ కాల్వ అవతలివైపున కంకటావ, రామానుజ వత్తర్లపల్లి ప్రాంతాల్లో పంట పొలాలు ఉన్నాయని వివరించారు. సదరు పొలాలకు సాగు నీరు అందటం లేదని, మామిళ్ల కోడు ఛానల్ ద్వారా నీటిని విడుదల చేస్తే సాగునీరు అందుతుందని విజ్ఞప్తి చేశారు. పొలాలకు వెళ్లాలంటే లజ్జబండా కాల్వ దాటి వెళ్లాల్సి వస్తుందని, కాల్వలో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కాల్వలో లోలెవెల్ చప్టాగానీ, వంతెన నిర్మాణం గానీ చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాల్వపై వంతెన నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచి మమ్మద్ రఫీ, మాజీ డీసీ చైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి, మాజీ సర్పంచి పుప్పాల రాంబాబు, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జామ్ తయారీపై మహిళలకు శిక్షణ

దాలిపర్రు(ఘంటసాల): మండలంలోని దాలిపర్రు గ్రామంలోని మహిళలకు కూరగాయాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణ కార్యక్రమం శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి, మునక్కాయ నిల్వ పచ్చడి, క్యారెట్–బీట్ రూట్ జామ్, క్యారెట్ నిల్వ పచ్చడికి కావాల్సిన పదార్థాలను తెలిపి తయారు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. సర్పంచ్ డోకిపర్తి శాంత కుమారి, కేవీకే శాస్త్రవేత్తలు జె.యశ్వంత్ కుమార్, డాక్టర్ కె.రేవతి, మహిళలు పాల్గొన్నారు.